సాక్షి జనగామ

ఆదివారం । 23 । మార్చి । 2025



అరచేతిలో విద్యుత్‌సేవలు
టీజీ ఎన్పీడీసీఎల్ రూపొందించిన యాప్‌తో వినియోగదారులకు అరచేతిలోనే సంస్థ సేవలు అందుబాటులో ఉంటాయి. - 8లో▸



సంకీర్ణ ప్రభుత్వాలతోనే సుస్థిర పాలన
సంకీర్ణ ప్రభుత్వాలతో సుస్థిర పాలన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$38^0/23^0$


వాతావరణం
ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత అధికమవుతుంది. రాత్రి పూట ఉక్కపోతగా ఉంటుంది.

ఇఫ్తార్	సహర్
ఆది 6:34	సోమ 4:59

రంజాన్ వేళలు

పురపాలిక అంచనా బడ్జెట్
రూ.13.41 కోట్లు

- ఆదాయం, ఖర్చులు రూ.11కోట్లు
- క్యాపిటల్ గ్రాంట్స్ రూ.7.46కోట్లు
- ఆస్తిపన్నుపై రూ.4.20 కోట్లు
- రెండు రోజుల్లో సమావేశం



జనగామ పురపాలిక బడ్జెట్‌కు సమయం ఆసన్నమైంది. గత సంవత్సరం ఓపెనింగ్ బ్యాలెన్స్, ఆదాయం కలుపుకుని అంచనా బడ్జెట్ రూప కల్పన చేశారు. మరో రెండు రోజుల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ పింకేష్‌కుమార్ అధ్యక్షతన 2025–26 బడ్జెట్‌కు ఆమోదం తెలుపనున్నారు.

– జనగామ

మున్సిపాలిటీకి సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను అధికారులు సిద్ధం చేశారు. వార్షిక అంచనా విలువ రూ.13.41కోట్లతో కౌన్సిల్ ముందు బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. 2024–25 మిగులు బడ్జెట్ ముగింపు నిల్వ రూ.71.91 లక్షలు కలుపుకుని.. ప్రస్తుత బడ్జెట్‌ను సవరించారు. పట్టణ సుందరీకరణ, మురికి వాడల అభివృద్ధి, ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు, ప్రజా అవసరాలు, వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులు తదితరాలకు పురపాలికకు వచ్చే ఆదాయంలో ఖర్చు కింద చూపిస్తున్నారు. అంచనా ఆదాయం రూ.11కోట్లు చూపిస్తుండగా, గత ఏడాది మిగులు(ఓపెనింగ్ బ్యాలెన్స్) రూ.2.41కోట్లు కలుపుకుని మొత్తం రూ.13.41 కోట్లుగా లెక్కించారు. అంచనా క్యాపిటల్(ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్స్) ఆదాయం రూ.7.46 కోట్లు వచ్చే అవకాశం ఉన్నట్లుగా నివేదికలో పేర్కొన్నారు.

ఆదాయం అంచనా..

పురపాలిక ఆస్తి, అసైన్డ్ పన్ను, రెమ్యునరేటివ్ ఎంటర్ ప్రైజెస్ రెంటల్, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య విభాగం, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ శాఖల ద్వారా రూ.11 కోట్ల మేర ఆదాయం వస్తుందని లెక్క చూపిస్తుండగా.. ఇది గత ఏడాది కంటే రూ.77 లక్షలు తక్కువ. నాన్‌ప్లాన్, ప్లాన్, ఇతర గ్రాంట్స్ ద్వారా రూ.7.46 కోట్లు వస్తాయని చెబుతున్నారు. 2025–26 వార్షిక అంచనా, మిగులు బడ్జెట్ రూ.13.41 కోట్లుగా పేర్కొంటుండగా.. ఇందులో ఆస్తిపన్ను గత ఏడాది రూ.5.14 కోట్లు ఉండగా.. ఈసారి రూ.4.20 కోట్లు చూపిస్తూ రూ.94 లక్షలు తగ్గించారు. నాన్ ట్యాక్స్ వనరుల ద్వారా రెమ్యునరేటివ్ ఎంటర్‌ప్రైజెస్ రెంటల్ ద్వారా రూ.63లక్షలు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య విభాగం నుంచి రూ.44లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగం రూ.5కోట్లు, ఇంజనీరింగ్ విభాగం రూ.73 లక్షలు, ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్స్ (క్యాపిటల్ ప్రాజెక్టు ఫండ్) కేటగిరీలో నాన్‌ప్లాన్ గ్రాంట్స్ ద్వారా రూ.3కోట్లు, ప్లాన్ గ్రాంట్స్ రూ.35లక్షలు, ఇతర గ్రాంట్స్ ద్వారా రూ.4.11 కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు.

తగ్గుతూ వస్తున్న బడ్జెట్

జనగామ పురపాలిక బడ్జెట్‌ను పరిశీలిస్తే తగ్గుతూ వస్తున్నది. 2021–22 బడ్జెట్ నుంచి 2022–23 వచ్చే సరికి రూ.77లక్షలు తగ్గగా.. 2023–24లో ఏకంగా రూ.1.10కోట్లు తగ్గిపోయింది. 2025–26 అంచనా బడ్జెట్‌లో మునుపటి కంటే రూ.93 లక్షల ఆదాయం పెంచి చూపించారు.

ఖర్చు ఇలా...

అంచనా బడ్జెట్‌లో ఆదాయం రూ.11 కోట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొనగా.. ఖర్చు అంతే మొత్తం చూపిస్తున్నారు. ఇందులో ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు రూ.4.08కోట్లు, ప్రజారోగ్య, పారిశుద్ధ్యానికి సంబంధించి రూ.98లక్షలు, విద్యుత్ చార్జీలు రూ.2.80కోట్లు, రుణాల చెల్లింపులు రూ.10లక్షలు, గ్రీన్ బడ్జెట్‌కు(10శాతం నిధులు) రూ.1.40లక్షలు, ఇంజనీరింగ్ విభాగం నిర్వహణకు రూ.68లక్షలు, జనరల్ అడ్మినిస్ట్రేషన్ రూ.73 లక్షలు, పట్టణ ప్రణాళిక వ్యయం రూ.13లక్షలు, ప్రజా అవసరాలకు రూ.3.42 కోట్లు, వార్డుల వారీగా పనులకు రూ.3.42 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉన్నట్లు నివేదించారు. అయితే అంచనా బడ్జెట్‌లో చేర్పులు, మార్పులు ఉంటాయి.

రెండు రోజుల్లో సమావేశం..



2025–26 వార్షిక బడ్జెట్‌కు సంబంధించి అన్ని సిద్ధం చేశాం. రెండు రోజుల్లో స్పెషల్ ఆఫీసర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ఆధ్వర్యాన బడ్జెట్‌కు ఆమోదం తీసుకుంటాం. అంచాన బడ్జెట్ తయారు చేయగా.. ఇందులో చేర్పులు, మార్పులకు అవకాశం ఉంది.

- వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్

2021-22 నుంచి 2025-26 వరకు బడ్జెట్ వివరాలు:

ఆర్థిక సంవత్సరం	2021-22	2022-23	2023-24	2024-25	2025-26(అంచనా)
ఓపెనింగ్ బ్యాలెన్స్	రూ.3.45కోట్లు	రూ.1.53కోట్లు	రూ.1.90 కోట్లు	రూ.71.92లక్షలు	రూ.2.41 కోట్లు
ఆదాయం	రూ.10.91కోట్లు	రూ.12.06కోట్లు	రూ.10.59 కోట్లు	రూ.11.77కోట్లు	రూ.11 కోట్లు
ఖర్చు	రూ.11.33 కోట్లు	రూ.12.06 కోట్లు	రూ.10.59కోట్లు	రూ.11.77 కోట్లు	రూ.11కోట్లు
ప్రభుత్వ గ్రాంట్స్	రూ.24.42కోట్లు	రూ.21.61కోట్లు	రూ.8.29కోట్లు	రూ.15.66కోట్లు	రూ.7.46కోట్లు

న్యూస్‌రీల్

భక్తుల ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు



జనగామ రూరల్: ఆర్టీసీ జనగామ డిపో లాజిస్టిక్(కార్గో) ద్వారా భక్తుల ఇంటికే శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలు అందించనున్నట్లు డిపో మేనేజర్ ఎస్.స్వాతి తెలిపారు. శనివారం ఆమె డిపోలో సీతారామ చంద్రస్వామి కల్యాణ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. భక్తులు జనగామ బస్టాండ్ ఆవరణలోని కార్గో లాజిస్టిక్ ద్వారా బుక్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 9154298762 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మహిళా రైతులకు చేయూత

జనగామ రూరల్: వ్యసాయ యాంత్రీకరణకు 50 శాతం రాయితీతో మహిళా రైతులకు ప్రభుత్వం చేయూత అందిస్తున్నదని డీఏఓ రామారావు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు బ్యాటరీ పంపులు, తైవాన్ పంపులు, రోటోవేటర్లు, విత్తనాలు నాటే మిషన్లు, కేజ్‌వీల్స్, కలుపు తీసే యంత్రాలు, గడ్డికట్టె యంత్రాలు, డ్రోన్లు, ట్రాక్టర్లు, నాగలి, పవర్ టిల్లర్ తదితర 289 యూనిట్ల వ్యవసాయ యంత్రాలు(రూ.69.89 లక్షలు) మంజూరయ్యాయని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 25వ తేదీలోగా మండల వ్యవసాయాధికారులకు లేదా ఏఈఓలకు అందజేయాలని సూచించారు. ఎంపికైన రైతులు సంబంధిత కంపెనీలకు రాయితీ పోను మిగతా డబ్బులు డీడీ తీసి చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.


నలుగురు విద్యార్థుల గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లాలో శనివారం రెండో రోజు జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. 6,202 మంది విద్యార్థులకు 6,198 మంది పరీక్ష రాసినట్లు డీఈఓ రమేశ్ తెలిపారు. పట్టణంలోని ధర్మకంచ, సెయింట్ మేరీస్ సెంటర్లను కలెక్టర్ రిజ్వాన్ బాషా, కొడకండ్ల, పాలకుర్తి సెంటర్లను డీఈఓ సందర్శించారు.

డాక్టర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ: జిల్లాలోని వైద్య విధాన పరిషత్ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, జఫర్‌గఢ్, బచ్చన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్టు పద్ధతిన వైద్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరాంజనేయులు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గైనకాలజీ, పిల్లల వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, అనస్తీషియా, నేత్ర వైద్యులకు సంబంధించి ఎంబీబీఎస్ అర్హతగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 26న సాయంత్రం 5 గంటలలోపు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు కలెక్టరేట్ రూం నంబర్–16లో దరఖాస్తు అందజేయాలన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్(స్పెషలిస్టు)కు రూ.లక్ష, సివిల్ అసిస్టెంట్ సర్జన్(జీడీ ఎంఓ)కు నెలవారీ వేతనం రూ.52,351 ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు https://jangaon.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

‘పీఎం కుసుం’ స్కీం రైతులకు ఉపయోగం



జనగామ రూరల్: ‘పీఎం కుసుం’ స్కీం రైతులకు ఎంతో ఉపయోగమని జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వేణుమాధవ్ అన్నారు. శనివారం జనగామ సర్కిల్ పరిధిలో టీజీ ఎన్పీడీసీఎల్, టీజీ రెడ్కో ఆధ్వర్యాన పీఎం కుసుం స్కీంపై రైతు సమూహాలు, సహకార సంఘాలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద జిల్లాలో 179 మంది రైతులు 242 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. సదస్సులో డివిజనల్ ఇంజనీర్(టెక్నికల్) గణేశ్, జనగామ డివిజనల్ ఇంజనీర్ లక్ష్మీనారాయణరెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.16.22 కోట్ల వడ్డీలేని రుణం

- మహిళా సంఘాలకు మంజూరు

జనగామ: క్రమం తప్పకుండా రుణ బకాయిలు చెల్లిస్తున్న స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.16.22 కోట్ల వడ్డీలేని రుణాలను కొత్తగా మంజూరు చేసింది. ఈ మేరకు కలెక్టర్ రిజ్వాన్ బాషా శనివారం వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 8,997 స్వయం సహాయక సంఘాలు రుణాలు తీసుకున్న తర్వాత జాప్యం లేకుండా వాయిదాలు చెల్లిస్తున్నాయని, ఈ సంఘాలకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు లింకేజీ ద్వారా పెద్ద మొత్తంలో వడ్డీలేని రుణాలను విడుదల చేసినట్లు వివరించారు.

మండలాల వారీగా విడుదలైన రుణాలు

మండలం	సంఘాలు	రుణం
బచ్చన్నపేట	841	రూ.1.56కోట్లు
చిల్పూరు	763	రూ.1.47కోట్లు
దేవరుప్పుల	739	రూ.1.01కోట్లు
స్టేషన్‌ఘన్‌పూర్	856	రూ.1.66కోట్లు
జనగామ	845	రూ.1.80కోట్లు
కొడకండ్ల	547	రూ.1.80కోట్లు
లింగాలఘణపురం	882	రూ.1.72కోట్లు
నర్మెట	448	రూ.64.85లక్షలు
పాలకుర్తి	1,026	రూ.1.60కోట్లు
రఘునాథపల్లి	1,050	రూ.2.11కోట్లు
తరిగొప్పుల	385	రూ.60.79లక్షలు
జఫర్‌గఢ్	615	రూ.1.02 కోట్లు

వీఆర్వోలు మళ్లొస్తుండ్రు

- గ్రామ పాలనాధికారిగా పేరు మార్పు
- త్వరలో వెలువడనున్న విధి విధానాలు

జనగామ: రెవెన్యూ వ్యవస్థలో అవినీతి పేరుకుపోయిందనే కారణం చేత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్వోల వ్యవస్థను రద్దు చేసి.. ఉద్యోగుల అర్హత ఆధారంగా ఇతర శాఖల్లో విలీనం చేసింది. దీంతో రెవెన్యూ పరంగా గ్రామాల్లో కొంతమేర ఇబ్బందులు తలెత్తినప్పటికీ.. ఆ బాధ్యతలను వీఆర్‌ఏలకు అప్పగించారు. దీనిపై ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైనా అప్పటి సర్కారు వెనక్కి తగ్గలేదు. అధికారంలోకి రాగానే వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ జీఓ జారీ చేశారు. రెవెన్యూ శాఖలో గ్రామ పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేసేందుకు వీఆర్వో వ్యవస్థను తిరిగి తీసుకువచ్చే క్రమంలో వీఆర్వో, వీఆర్‌ఏలను రిటన్ బ్యాక్ తీసుకునేందుకు ‘గ్రామ పాలనా అధికారి’(జీపీఓ)గా పేరు మార్చారు. ఇందుకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలు రావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం, ధ్రువీకరణ పత్రాల జారీ, భూ వివాదాల విషయంలో సత్వర పరిష్కారం, విలువైన భూములను కాపాడడంతో పాటు రెవెన్యూ పరంగా వీఆర్వోల నియామకంతో తహసీల్దార్లపై కొంతమేర ఒత్తిడి తగ్గనుంది. వీఆర్వో వ్యవస్థను రద్దు చేసిన తర్వాత ఐదేళ్ల సుదీర్ఘ కాలం తర్వాత పేరు మార్చుకుని జీపీఓగా ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరనున్నారు. జిల్లాలో 116 మంది వీఆర్వోల అంగీకారం మేరకు అదే హోదాలో ఉద్యోగంలో చేరనుండగా.. ఇంటర్, డిగ్రీ ఆధారంగా వీఆర్‌ఏలను తీసుకోనున్నారు.

గత అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలి



రద్దయిన గ్రామ రెవెన్యూ అధికారిని ఎలాంటి షరతులు లేకుండా.. గత అనుభవం, సీనియారిటీని పరిగణలోకి తీసుకుని ప్రమోషన్లు కల్పించేలా చూడాలి. గడిచిన ఐదేళ్ల నుంచి పదోన్నతులు, ఇంక్రిమెంట్లు లేక ఇబ్బందులకు గురైన వీర్వోలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో ఎప్పుడూ.. ఎవరూ తీసుకోని గొప్ప నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంది.

- పెండెల శ్రీనివాస్, గ్రామ రెవెన్యూ అధికారుల జిల్లా జేఏసీ చైర్మన్

‘విద్యానిధి’కి దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు 2025 విద్యాసంత్సరం ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లడానికి ఆర్థిక సహాయం కోసం అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డాక్టర్ బి.విక్రమ్‌కుమార్ తెలిపారు. ఏదైనా నాలుగేళ్ల డిగ్రీ కోర్సు చదివిన లేక చివరి సంవత్సరం చదువుతున్న వారు మే 19లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్‌కొరియా దేశాల్లో ఉన్నత చదువుకు వెళ్లేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షలలోపు ఉండాలని ఒక ప్రకటనలో తెలిపారు.

ధాన్యం సేకరణ పక్కాగా చేపట్టాలి

- కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ పక్కాగా చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. రబీ ధాన్యం కొనుగోలుపై శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 3,75,453 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామని, అందులో 2,35,954 మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 62,013 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 1,73,941 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం సేకరించనున్నట్లు తెలిపారు. ఈసారి జిల్లాలో 300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో సన్న ధాన్యం సేకరణకు 119, దొడ్డు ధాన్యం సేకరణకు 181 సెంటర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇందులో సహకార సంఘాల ఆధ్వర్యాన 134 కేంద్రాలు, ఐకేపీ 164, డీసీఎంఎస్ 2 కేటాయించామన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడిన ధాన్యం తీసుకువచ్చి ఎ–గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ గోపీరాం, డీఆర్డీఓ వసంత, సివిల్ సప్లయీస్ డీఎం హతీరామ్, డీఏఓ రామారావునాయక్, కోఆపరేటివ్, మార్కెటింగ్ అధికారులు రాజేందర్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం స్కీంలో ఉద్యోగాల భర్తీ

- 29వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జునరావు

జనగామ: నేషనల్ హెల్త్ మిషన్ స్కీం(ఎన్‌హెచ్‌ఎం) కింద జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో 33 పోస్టులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జునరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, https://jangaon.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారంతో జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ జనగామ పేరిట రూ.500 డీడీ తీసి, విద్యార్హతలు, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. భర్తీ చేసే పోస్టులు ఇలా ఉన్నాయి. జిల్లా డాటా మేనేజర్(ఐటీ/డీపీఎంయూ), జిల్లా డాటా మేనేజర్(ఐడీఎస్ పీ/డీపీఎంయూ), సోషల్ వర్కర్(ఎన్ఎంహెచ్‌పీ), సెకండ్ ఏఎన్ఎం(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ హ్యూమన్ రిసోర్స్), అనస్తీషియా(ఎంసీహెచ్‌వింగ్), ఓబీజీ స్పెషలిస్టు(ఎంసీహెచ్ వింగ్), సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్(ఎన్‌టీఈపీ) ఒకటి చొప్పున, అలాగే స్టాఫ్ నర్సు(ఎంసీహెచ్, చైల్డ్ హెల్త్, ఎస్ఎన్‌సీయూ) 18, స్టాఫ్ నర్సు, జిల్లా ఎన్‌సీడీ క్లినిక్(ఎన్‌పీసీడీ సీఎస్) 8 పోస్టులు ఉన్నాయి.

పరిమితికి మించి ప్రయాణించొద్దు

- విజిలెన్స్ ఏఎంవీఐ అపర్ణ



వాహన డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏఎంవీఐ అపర్ణ

పాలకుర్తి టౌన్: స్కూల్ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దు.. నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేస్తామని విజిలెన్స్ ఏఎంవీఐ అపర్ణ స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. సకాలంలో ట్యాక్స్ చెల్లించని రెండు వాహనాలను ఈ సందర్భంగా సీజ్ చేశారు. అనంతరం స్థానిక ప్రైవేట్ పాఠశాల బస్సులను తనిఖీ చేశారు. విద్యార్థుల తరలింపునకు కాకుండా ప్రైవేట్ కార్యక్రమాలకు బస్సులు వినియోగిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అకాల వర్షం.. మక్క రైతు ఆగం



మార్కెట్‌లో మొక్కజొన్న కుప్పల చుట్టూ నిలిచిన వర్షపు నీరు



తడిసిన మక్కలను యార్డులో ఆరబోసుకుంటున్న రైతు

- మార్కెట్‌లో తడిసిన మొక్కజొన్నలు
- నిద్రలేచే సరికి నీళ్లలో గింజలు..
- లబోదిబోమంటున్న అన్నదాతలు



వర్షానికి తడిసి నల్లబారిన మక్కలు

జనగామ: కరువుతో పంటల దిగుబడి కోల్పోయి నష్టపోయిన రైతులు.. అకాల వర్షాలతో మరింత ఆగమై పోతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఆకస్మికంగా కురిసిన వాన మక్క రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. జిల్లాలో యాసంగి సీజన్ సాగు చేసిన మక్కజొన్న పంటను రైతులు అమ్ముకునేందుకు జనగామ వ్యవసాయ మార్కెట్‌కు వస్తున్నారు. గింజలు పచ్చిగా ఉండి తేమ శాతం ఎక్కువ చూపిస్తోంది. గిట్టుబాటు ధర పొందడానికి కాటన్ యార్డులో ఆరబోసుకుని రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు వారం రోజుల నుంచి చెబుతున్నారు. అయితే శుక్రవారం అర్ధరాత్రి రైతులు గాఢనిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా కుండపోతగా వాన పడింది. రైతులు మేల్కొని చూసేసరికి గింజలు నీటిలో మునిగిపోవడమే కాకుండా వరదలో కొట్టుకుపోతుండగా కాపాడుకోవడానికి విశ్వప్రయత్నం చేశారు. మక్కల కుప్పల వద్ద పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. నీటిలో మునిగిన మక్కలను వేరు చేయగా.. కొంతమేర గింజలు నలుపురంగుకు వచ్చాయి. మరో రెండురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పడిపోయిన ధర

మార్కెట్‌లో శనివారం మక్కలకు ధర పడిపోయింది. అకాల వర్షాల భయంతో రైతులు తక్కువ ధరకు అమ్ముకున్నారు. మక్కలు తడిసి పోవడంతో వ్యాపారులు తేమ సాకుతో క్వింటాకు రూ.150 నుంచి రూ.250 వరకు తగ్గించారు. ప్రైవేట్‌లో రూ.2,400 నుంచి రూ.2,500 వరకు ధర పలుకుతుండగా.. మార్కెట్‌లో రూ.1,855, రూ.1,925, రూ.2,066 ధరతో కొనుగోలు చేశారు. మక్కలకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ ధర తగ్గించడంపై రైతులు మండి పడుతున్నారు.

50 బస్తాలు తడిసినయ్



రెండెకరాల్లో మక్క సాగు చేసిన. రూ.45వేల పెట్టుబడి అయింది. 90 బస్తాల(చిన్నవి) దిగుబడి వచ్చింది. మూడు రోజుల క్రితం జనగామ మార్కెట్‌కు తెచ్చిన. తేమ ఎక్కువగా ఉందని రేటు తక్కువ చెప్పడంతో కాటన్‌యార్డులో ఆరబోసుకున్నాను. అర్ధరాత్రి కురిసిన అకాల వానకు 50 బస్తాలు తడిసిపోయాయి.

- సోమయ్య, దర్దెపల్లి, పాలకుర్తి

రెక్కల కష్టమూ మిగిలేది కష్టమే..



రెండెకరాల్లో మొక్కజొన్న వేసిన. రూ.30వేల పెట్టుబడి కాగా.. 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రెండ్రోజుల క్రితం మార్కెట్‌కు తీసుకొచ్చి ఆరబోసిన. రాత్రి మక్కలను కుప్పచేయడానికి డోజర్ కిరాయికి అడిగితే గంటకు రూ.వెయ్యి అన్నరు. అయినా రాలేదు. అకాల వర్షంతో రెక్కల కష్టం మిగిలే పరిస్థితి లేదు.

- ముసికె ప్రభాకర్, అయ్యంగార్‌పల్లి, పాలకుర్తి

గిట్టుబాటు ధర వచ్చేలా లేదు..



కాటన్ యార్డులో మక్కలు ఆరబోసి ఉంచాను. అర్ధరాత్రి కురిసిన వర్షంతో వరద నీరంతా గింజల కింద నుంచి వెళ్లింది. కొంతమేర కొట్టుకు పోగా.. ఉన్న గింజలు పూర్తిగా తడిసి పోయాయి. 26 బస్తాల మక్కలు ముద్దయ్యాయి. గిట్టుబాటు ధర వచ్చేలా లేదు.

- అణువుల మహేందర్, అయ్యంగార్‌పల్లి, పాలకుర్తి

శాలివాహన జయంతిని అధికారికంగా నిర్వహించాలి

జనగామ రూరల్: దేశంలో గొప్ప పాలన అందించిన శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జిల్లా హిందూ కుమ్మర శాలివాహన ప్రజాపతి ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జివిలికపల్లి నరహరి డిమాండ్ చేశారు. శనివారం జనగామ చౌరస్తాలో శాలివాహన జయంతి వేడుకలు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వంగపల్లి విష్ణు, ఏనుగుతల సోమేశ్వర, కల్పగిరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకోవాలి

- ఉపాధి హామీ పథకం డ్రాఫ్టింగ్ కమిటీ మెంబర్ జాన్‌డ్రీజ్



కొబ్బరి మొక్కలను పరిశీలిస్తున్న జాన్‌డ్రీజ్

స్టేషన్‌ఘన్‌పూర్: ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకోవాలని రాంచీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్, ఉపాధి హామీ పథకం డ్రాఫ్టింగ్ కమిటీ మెంబర్ జాన్‌డ్రీజ్ అన్నారు. మండల పరిధి అక్కపెల్లిగూడెంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు ఈజీఎస్ పనులను బాగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. సాగులో లేని భూమిని సాగులోకి తేవడం, వ్యవసాయ భూముల వద్దకు రోడ్లు వేయడం, పొలం గట్లపై కొబ్బరి, టేకు, నిమ్మ చెట్లు పెంచడం బాగుందని అభినందించారు.

ఇంటర్ గురుకులాల్లో ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్ కె. ఇందుమతి శనివారం తెలిపారు. 2025లో పదో తరగతి పరీక్షలకు హాజరైన బాలబాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు http:tgrjc.gov.in దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 040– 24734899, 9866559727 నంబర్లను సంప్రదించాలని జిల్లా కో–ఆర్డినేటర్ ఇందుమతి సూచించారు.

4వ తేదీన గిరిజన భవన్‌లో జాబ్‌మేళా

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో వచ్చే నెల 4వ తేదీన ఉదయం 10 గంటలకు హనుమకొండలోని గిరిజన భవన్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి చిత్రమిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఎఎన్ఎం, జీఎన్ఎం, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ చదివిన, ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు తమ బయోడేటా, విద్యార్హత జిరాక్స్ ప్రతులతో సకాలంలో జాబ్ మేళాకు హాజరు కావాలని పీఓ పేర్కొన్నారు.



అరచేతిలో విద్యుత్ సేవలు

యాప్ రూపొందించిన టీజీ ఎన్పీడీసీఎల్ | 20 ఫీచర్లతో అందుబాటులోకి..

సాక్షి మీకోసం

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో టీజీ ఎన్పీడీసీఎల్ ఓ యాప్‌ను రూపొందించింది. సుమారు 20 ఆధునిక ఫీచర్లతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యాప్ ద్వారా ఇంట్లోనే ఉండి సమస్యలపై ఫిర్యాదు చేయడంతోపాటు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, నూతన సర్వీస్‌ల మంజూరు, పేరు మార్పు వంటి సేవలు పొందే అవకాశముంది.

రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్: ఎక్కడ ఎలాంటి ఘటన జరిగినా ఇందులో జీపీఎస్ లోకేషన్ ద్వారా వినియోగదారుడి ఫోన్ కెమెరా నుంచి ఆ ఘటన ఫొటో తీసి పంపవచ్చు. తద్వారా రిపోర్ట్ నేరుగా సంబంధిత అధికారికి వెళ్తుంది. దీంతో సమస్య త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

కన్స్యూమర్ గ్రీవెన్స్: వినియోగదారుడి సమస్యలు నేరుగా ఇందులో పొందుపరచవచ్చు. వినియోగదారుడి మీటర్ నంబర్, సమస్య వివరాలు ఇందులో నమోదు చేస్తే సమస్యను పరిష్కరిస్తారు. విద్యుత్‌కు సంబంధించి ఏ అంశమైనా ఫిర్యాదు చేసే సౌకర్యం ఈ యాప్‌లో అందుబాటులో ఉంది. ఫిర్యాదు స్టేటస్ చూసుకునే సౌలభ్యం ఉంది. సమస్య పరిష్కారంపై సంతృప్తి చెందకపోతే పునరావృతం చేసుకునే వీలుంది.

సెల్ఫ్ రీడింగ్: ఈ యాప్ ద్వారా వినియోగదారులు సెల్ఫ్ రీడింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ప్రతీ నెల నిర్ణీత తేదీన వారి విద్యుత్ బిల్లులను సెల్ఫ్ మీటర్ రీడింగ్ తీసుకోవచ్చు.

పే బిల్స్: నెలవారీ విద్యుత్ బిల్లులను వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదు చేసుకొని చెల్లించవచ్చు. దీంతో సమయం ఆదా అవుతుంది. బిల్ కౌంటర్లకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

బిల్ హిస్టరీ: వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లుల గత చరిత్ర ఇందులో చూసుకోవచ్చు. తద్వారా ప్రతీ నెలా బిల్లు ఎంత వస్తుంది పోల్చుకోవచ్చు. అలాగే విద్యుత్ వినియోగడం ఏ నెల ఎంత పెరిగిందో చూసుకుని పొదుపుగా వాడుకునే అవకాశం ఉంది.

ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ: ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లు వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకునే సౌకర్యముంది.

కొత్త సర్వీస్ స్థితి: కొత్త సర్వీసుల రిలీజ్ స్థితిగతులు ఎప్పటికప్పుడు అప్లికేషన్ నంబర్ ఎంటర్ చేసి తెలుసుకునే సౌకర్యం ఉంది. తద్వారా కొత్త సర్వీసుల మంజూరు వేగంగా జరుగుతుంది.

లింక్ ఆధార్– మొబైల్: వినియోగదారుల ఆధార్, మొబైల్ నంబర్లు లింక్‌తో విద్యుత్ బిల్లుల సమాచారం ఫోన్‌కు చేరుతుంది. దీంతో గడువులోగా బిల్లులు చెల్లించవచ్చు

కొత్త కనెక్షన్, పేరుమార్పు: కొత్త విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇందులో పొందుపరిచారు. దీంతోపాటు విద్యుత్ మీటర్ పేరు మార్పు, లోడ్‌కు సంబంధిందించిన వివరాలు ఇందులో ఉన్నాయి.

పవర్ కంజమ్షన్ గైడ్ లైన్స్: విద్యుత్ ఉపకరణాలు ఎంత వాడితే ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో ఇందులో వివరించారు.

టారిఫ్ డీటెయిల్స్: విద్యుత్ వినియోగం చార్జీల వివరాలు కేటగిరీల వారీగా ఇందులో ఉంటాయి. గృహ, గృహేతర వినియోగదారులు, పరిశ్రమలు, ఇతర కేటగిరీల వారీగా చార్జీల వివరాలు ఇందులో పొందుపరిచారు.

ఎనర్జీ సేవింగ్, సేఫ్టీ టిప్స్: విద్యుత్ ఉపకరణాలు వాడుతున్నపుడు పాటించాల్సిన పొదుపు సూచనలు, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇందులో వివరించారు.

ఫీడ్ బ్యాక్: వినియోగదారులకు అందిస్తున్న సేవలపై అభిప్రాయాన్ని పంచుకోవచ్చు. ఇది చాలా ముఖ్యం. సలహాలను అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకొని మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుంది.

మై అకౌంట్: మై అకౌంట్‌లో వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి. వారి మీటర్ తాలూకు వివరాలు, తదితర సమాచారం ఉంటుంది.

వినియోగదారుల బిల్లు సమాచారం: దీనిలో వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదు చేసి బిల్లు వివరాలు తెలుసుకోవచ్చు.

అధికారి వివరాలు: వినియోగదారుల పరిధిలోని అధికారి వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోచ్చు. వినియోగదారులకు ఎటువంటి సందేహాలున్న తమ పరిధిలోని అధికారిని ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు.

కాంటాక్ట్ అజ్: ఇందులో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు 1800 4250028, 1912 ఉంటాయి. వీటి ద్వారా సమస్యలు త్వరగా పరిష్కరించుకునే వెసులుబాటు ఉంది.

యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం



టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌పై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. అరచేతిలోకి విద్యుత్ సేవలు తీసుకెళ్లడానికి ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి యాప్‌ను ఆధునికీకరించి 20 రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

– మధుసూదన్‌రావు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, హనుమకొండ

యాప్‌తో అనేక ప్రయోజనాలు



టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా అనేక ప్రయోజనాలున్నాయి. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని సేవలు పొందొచ్చు. కార్యాలయాలకు రావాల్సిన సమయం, ఖర్చులు ఆదా అవుతాయి.

– గౌతం రెడ్డి, టీజీ ఎన్పీడీసీఎల్, ఎస్ఈ వరంగల్

ఇక ఎత్తిపోసుడే..

- దేవాదుల–3 మోటార్లు ప్రారంభానికి అంతా సిద్ధం



పంప్‌హౌస్

హసన్‌పర్తి : దేవాదుల ప్రాజెక్టు మూడో దశ కింద దేవన్నపేటలో నిర్మించిన పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ చెరువులోకి నీటిని ఎత్తిపోయడానికి అంతా సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం లేదా సాయంత్రం మంత్రి చేతుల మీదుగా మోటార్ల ప్రారంభానికి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమానికి నీటిపారుదలశాఖ మంత్రా? ఇన్‌చార్జ్ మంత్రిని ఆహ్వానిస్తారా అనే విషయం అధికారులు స్పష్టంగా పేర్కొనడం లేదు. ఐదు రోజుల క్రితమే నీటిపారుదల శాఖ మంత్రి మోటార్లు ప్రారంభించడానికి వచ్చి కేవలం పూజలు చేశారు. ఆ రోజు అర్ధరాత్రి వరకూ మోటార్లు ప్రారంభించడానికి వేచి చూసి వెనుదిరిగారు. అప్పటికే పనులు పూర్తి కాకపోవడంతో ఆయన అధికారులపై సీరియస్సయ్యారు. ఇదిలా ఉండగా, పనులు పూర్తికి ఐదురోజుల సమయం పట్టింది. అధికారులు రాత్రింబవళ్లు పంప్‌హౌస్ వద్ద ఉంటూ పనులు పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేశారు.

ప్రత్యేక నిపుణుల రాక..

దేవాదుల ప్రాజెక్టు–3 కింద ఏర్పాటు చేసే మోటార్లు ఆస్ట్రియాకు చెందిన ఆండ్రీజ్ కంపెనీవి. మోటార్లు ఆన్‌చేస్తే మళ్లీ ఏదైనా సాంకేతిక సమస్యలు ఏర్పడకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. ఆ దేశానికి చెందిన ప్రత్యేక నిపుణులతో ట్రయల్ కోసం దేవన్నపేటలోని పంప్‌హౌస్‌కు చేరుకున్నారు. ట్రయల్ రన్ కోసం అంతా సిద్ధం చేశారు. ఆదివారం ట్రయల్ రన్ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అధికారులు రెండు రోజులుగా డ్రై రన్ కొనసాగిస్తున్నారు.

నకిలీ పురుగు మందుల ముఠా అరెస్ట్

- రూ.78 లక్షల 63 వేల విలువైన మందులు, మిషనరీ, ప్రింటింగ్ సామగ్రి, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



నిందితులతోపాటు నకిలీ పురుగు మందులను చూపుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: ప్రముఖ కంపెనీల పేర్లతోపాటు గడువు తీరిన పురుగు మందులను రైతులకు అంటగడుతున్న ముఠాలోని ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.78లక్షల 63 వేల విలువైన నకిలీ పురుగు మందులు, మిషనరీ, ప్రింటింగ్ సామగ్రి, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీన చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్.. నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం వరంగల్ మట్టెవాడ బొడ్రాయి సమీపాన ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేదప్రకాశ్ ఇంటిపై టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు, వ్యవసాయధికారులు సంయుక్తంగా దాడి చేశారు. ఇందులో ముగ్గురు నిందితులు సిద్ధిక్, రాజేశ్, సదాశివుడుని అదుపులోకి తీసుకుని పెద్ద మొత్తంలో నకిలీ, గడువు తీరిన పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మట్టెవాడ పీఎస్‌లో విచారించారు. ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేద ప్రకాశ్.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో స్థానిక వ్యాపారులు, పురుగు మందుల కంపెనీ ప్రతినిధి అయిన మరో నిందితుడు సిద్ధిక్ వద్ద కాలం తీరిన పురుగు మందులను కొనుగోలు చేసేవాడు. అలాగే, గడువు దాటిన పురుగు మందులతోపాటు, ఇద్దరు నిందితులైన ఆళ్ల చెరువు శేఖర్, విష్ణువర్ధన్, ప్రస్తుతం జైలులో ఉన్న ఆదిత్య నుంచి ప్రముఖ పురుగు కంపెనీలైన ధనూక, టాటా, రైల్స్, బెయర్, ఆడ్మాతోపాటు మరికొన్ని కంపెనీ పేర్లతో తయారు చేసిన నకిలీ పురుగు మందులు కొనుగోలు చేసేవాడు. ఈ విధంగా సేకరించిన గడువు తీరిన పురుగు మందులతోపాటు నకిలీ పురుగు మందులను ప్రభుత్వ అనుమతులు లేని మిగతా నిందితులకు విక్రయించాడు. ఈ నకిలీ పురుగు మందులను కొనుగోలు చేసిన నిందితులు.. వీటిని స్థానికంగా ఉన్న వ్యవసాయదారులకు విక్రయిస్తూ మోసగించేవారు. పోలీసులు అరెస్ట్ చేసిన ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేదప్రకాశ్‌తోపాటు సదాశివుడు, రాజు ఆదిత్య గతంలోనూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ప్రధాన నిందితుడి సమాచారం మేరకు ఆళ్ల చెరువు శేఖర్, విష్ణువర్ధన్ గోదాములపై టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు దాడులు చేశారు. నిందితుల్లో విష్ణువర్ధన్ పరారీలో ఉన్నాడు. మరో వ్యక్తి ముద్దగుల ఆదిత్య హైదరాబాద్ జైలులో ఉండగా.. మిగతా ఏడుగురు మట్టెవాడకు చెందిన ఇరుకుల్ల వేదప్రకాశ్, లక్ష్మీపురానికి చెందిన మహ్మద్ సిద్ధిక్ అలీ, పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌బాద్‌కు చెందిన నూక రాజేశ్ అలియాస్ రాజు, కరీంనగర్‌కు చెందిన యల్లం సదాశివుడు, ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన ఎండీ రఫీక్, ఏపీలోని ప్రకాశం జిల్లా మడుగుకు చెందిన ఆళ్ల చెరువు శేఖర్, దుగ్గొండికి చెందిన పాదిళ్ల సాంబయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్లు గోపి, రాజు, ఎస్సైలు వంశీకృష్ణ, నవీన్, ఆర్ఎస్సై భాను ప్రకాశ్, ఏఏఓ సల్మాన్‌పాషా, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు సురేశ్, సురేందర్, సాంబరాజు, శ్రీనివాస్, సతీశ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

చెరువులో చేపలు పడుతుండగా..

దొంగలుగా భావించి బిహార్ కూలీలను చెట్టుకు కట్టేసిన కాంట్రాక్టర్లు

- గోవర్ధనగిరిలో ఘటన



చెట్టుకు కట్టేసి ఉన్న కూలీలు

రఘునాథపల్లి: చెరువులో చేపలు పడుతున్న ఐదుగురిని దొంగలుగా భావించి చెట్టుకు కట్టేసిన ఘటన శనివారం మండలంలోని గోవర్ధనగిరిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన కొందరు కూలీలు గ్రామశివారులోని ఆయిల్ కంపెనీలో పనులు చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో గ్రామ శివారులోని ఆనకుంటలో ఐదుగురు కూలీలు చెరువులో చేపలు పడుతున్నారు. కుంట చేపలను సంరక్షిస్తున్న కాంట్రాక్టర్లు వారిని దొంగలుగా భావించి తాడుతో చెట్టుకు కట్టేశారు. ఇటీవల వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు అపహరణకు గురవుతుండంతో వీరి పనేగా భావించి, చెట్టుకు కట్టేసిన ఫొటోలు గ్రామ వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు. అదే ఆయిల్ కంపెనీలో పని చేసే స్థానికులు వారిని గుర్తించి వారు బిహార్‌కు చెందిన కూలీలని, దొంగలు కాదని.. సరదాగా చేపలు పట్టేందుకు వచ్చారని వివరించడంతో వదిలేశారు.

సరదా.. విషాదమైంది

- ట్రాక్టర్ పైనుంచి జారిపడి బాలుడి మృతి
- పూమ్యాతండా సమీపంలో ఘటన




సాయికుమార్ మృతదేహం

గార్ల: సరదా.. విషాదమైంది. ట్రాక్టర్ పైనుంచి జారి టైర్ కింద పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం పూమ్యాతండా సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గార్ల గ్రామ పంచాయతీ పూమ్యాతండాకు చెందిన బానోత్ సాయికుమార్(15) సరదాగా ట్రాక్టర్‌పై మిరపతోటకు వెళ్లాడు. మిర్చిబస్తాలు లోడ్ చేసుకుని వస్తున్న ట్రాక్టర్ పొలం గట్టు ఎక్కుతున్న క్రమంలో ఒక్కసారి కుదుపునకు గురైంది. దీంతో బాలుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి కిందపడ్డాడు. వెనుక టైర్ బాలుడిపైనుంచి వెళ్లగా అక్కడికక్కడే మృతిచెందాడు. సాయికుమార్ గార్లలో 9వ తరగతి చదువుతున్నాడు. కాగా, సాయికుమార్ తండ్రి మంగీలాల్ 3 ఏళ్ల క్రితం ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి మృతిచెందాడు. సాయికుమార్‌కు తల్లి బుజ్జి, ముగ్గురు అక్కలు ఉన్నారు. కుటుంబంలో ఉన్న ఒక్కగానొక్క మగ దిక్కును కోల్పోయామని మృతుడి తల్లి, అక్కలు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. పోలీసులు ఘటనా స్థలిని సందర్శించారు.

సంకీర్ణ ప్రభుత్వాలతోనే సుస్థిర పాలన

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి | ● ముగిసిన జాతీయ సదస్సు



పరిశోధన పత్రాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ అధ్యాపకులు

కేయూ క్యాంపస్ : సంకీర్ణ ప్రభుత్వాలతో సుస్థిర పాలన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా సెనేట్‌హాల్‌లో 'భారత సమాజంలో సంకీర్ణ ప్రభుత్వాలు, ప్రజాస్వామ్యం' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం సాయంత్రం ముగిసింది. ఈ ముగింపు సభలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంకీర్ణ రాజకీయాలు, ప్రభుత్వాలు బహుళ వర్గాల ప్రజల ఐక్యతకు ప్రతీకయే గాకుండా ప్రజలకు జవాబుదారీగా వ్యవహరిస్తాయన్నారు.

సంకీర్ణ రాజకీయాలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

ప్రజాస్వామ్యం బలోపేతం, సంపదకేంద్రీకరణ సంకీర్ణ రాజకీయాలతోనే సాధ్యమని ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు కె. శ్రీనివాసులు అన్నారు. ఈ సదస్సులో ఆయన ప్రధానవక్తగా పాల్గొని మాట్లాడారు. సంకీర్ణం కేవల రాజకీయాలకు మాత్రమే కాదని ఆర్థిక సామాజికంలోనూ అవసరం అన్నారు. సంకీర్ణానికి భారతీయ జాతీయ ఉద్యమం గొప్ప ఉదాహరణ అన్నారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి సంకినేని వెంకట్, యూజీసీ కోఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, మద్రాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడారు. ఆ విభాగం బీఓఎస్ చైర్మన్ గడ్డం కృష్ణయ్య, రిటైర్డ్ ఆచార్యులు రఘురాంరెడ్డి, జి వీరన్న,హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ సదస్సులో 9 సెషన్లలో వంద మంది పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ పరిశోధన పత్రాలను పుస్తకం రూపంలోకి తీసుకురాగా వీసీ, రిజిస్ట్రార్ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఆవిష్కరించారు.

వన్యప్రాణుల వేటకు వెళ్లి.. ఉచ్చుకు తగిలి

- కరెంట్ షాక్‌కు గురై వ్యక్తికి తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతూ మృతి



గంగయ్య(ఫైల్)

ఏటూరునాగారం: అటవీ జంతువులను వేటాడటానికి వెళ్లిన ఓ వ్యక్తి.. కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని కొత్తగుడిసెల ప్రాంతానికి చెందిన తుమ్మ గంగయ్య(50), లొటపెటల నారాయణ, ఎద్దు లోకేశ్ కలిసి శుక్రవారం అర్ధరాత్రి చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు వెళ్లారు. ముగ్గురు కలిసి 33 కేవీ విద్యుత్‌లైన్‌కు కరెంట్ ఉచ్చులు తగిలించే ప్రయత్నం చేశారు. ఇందులో గంగయ్య కర్ర పట్టుకుని కరెంట్ వైర్లకు ఉచ్చుకు అమర్చిన వైర్ తగిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన లోకేశ్, నారాయణ భయభ్రాంతులకు గురై అక్కడి నుంచి వచ్చి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శనివారం ఉదయం ఘటనా స్థలికి చేరుకుని అతడిని రెండు కిలోమీటర్ల మోసుకుంటూ బయటకు తీసుకొచ్చారు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రుడిని 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ ఈ ఘటనలో లోకేశ్, లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కూతుళ్లు మౌనిక, అనిత ఉన్నారు.

సౌర ప్లాంట్‌తో రైతులు ఆర్థికంగా బలోపేతం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుతో రైతులు ఆర్థికంగా బలోపేతమవుతారని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్‌కో) సంయుక్తంగా శనివారం ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ల కార్యాలయంలో 'కుసుమ్' పథకం కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి సీఎండీ వరుణ్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడారు. రైతులు సౌర శక్తిని ఉత్పత్తి చేసి మరింత ఆదాయం సమకూర్చుకోవడానికి ఇది సువర్ణ అవకాశమన్నారు. సోలార్ ద్వారా ఉత్పత్తి చేసిన ప్రతీ యూనిట్‌కు రూ.3.13 ఇస్తామని, ప్రతీ నెల రైతు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. రూ.2 కోట్ల వరకు ఆరు శాతం వడ్డీకి బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులు ఈ నెల 28 వరకు రూ.లక్ష పూచీకత్తు సొమ్ము డిపాజిట్ చేయాలన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పూచీకత్తు సొమ్ము చెల్లిస్తామన్నారు. 25 ఏళ్ల అగ్రిమెంట్‌తో రైతులు లాభాలతో కూడిన నిలకడ ఆదాయం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు కె.వెంకటరమణ, రాజుచౌహాన్, జీఎం మల్లికార్జున్, టీజీ రెడ్కో డీజీఎం. వెంకటరమణ, డీఈలు అమర్‌నాథ్, సంపత్‌రెడ్డి, ఏఈ శ్రీపాల్ పాల్గొన్నారు.

ఆరోగ్యం కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలి

- ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయ భాను



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను, అధికారులు

హన్మకొండ: వేసవిలో ఆరోగ్యం కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలని టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను డిపో మేనేజర్లు, సిబ్బందికి సూచించారు. శనివారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలోని 9 డిపోల మేనేజర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమ్మర్ చాలెంజ్‌ను విజయవంతంగా నిర్వహించాలన్నారు. డీహైడ్రేషన్ నివారణకు రోజు తగిన మోతాదులో నీరు, మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరి నీరు తీసుకోవాలన్నారు. విధులు ముగిసిన తర్వాత తగిన విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఎలాంటి లీవ్‌లు, సిక్ లీవ్‌లు తీసుకోని, గైర్హాజర్ కాకుండా డ్యూటీలకు హాజరైన వారికి ప్రోత్సాహాలు అందించనున్నట్లు చెప్పారు. మార్చి నుంచి జూన్ మాసాంతం వరకు మరింత శ్రద్ధతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తూ డిపోల ఆర్థికాభివృద్ధికి, తద్వారా రీజియన్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.భానుకిరణ్, అకౌంట్స్ ఆఫీసర్ రవీందర్ రావు, డిపోల డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.